తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ |మంచిర్యాల ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్ మహబూబాబాద్

మంగళవారం

3 ఫిబ్రవరి 2026

పేజీలు : 08



## మున్సిపల్ ఎన్నికలు పిఓలు, ఓపిఓలకు కీలకం

- పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పిఓలు, ఓపిఓల బాధ్యతలు అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పిఓ, ఓపిఓ విధులు నిర్వహించే సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్ పోలింగ్, ఓటర్ల గుర్తింపు, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓటింగ్ ముగిసిన తర్వాత చేపట్టాల్సిన ప్రక్రియలపై సిబ్బందికి వివరించారు. ఎలాంటి చిన్న తప్పిదాలు చోటుచేసుకోకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పరిస్థితుల్లో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్నికల విభాగ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, పిఓలు, ఓపిఓలు పాల్గొన్నారు.



## జాతర ముగిసింది... దుర్గంధం మిగిలింది

- కొనసాగుతున్న మొక్కులు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న భక్తులు
- ప్రభుత్వ నుంచి వచ్చిన నిధులు లేన్ని చేసిన పని ఎంత పై విచారణ చేయాలని డిమాండ్......

**ఆత్మకూర్, ఫిబ్రవరి 2 (జనం సాక్షి) :** సమ్మక్క జన్మస్థానం మినీ మేడారం గా పేరుగాంచిన అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతర ముగిసింది జాతరలో చుట్టు పరిసరాలు దుర్గంధం దుర్వాసన వెదజల్లుతుంది. ఆత్మకూరు మండలం అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే భారతదేశ పండుగ కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం వనదేవతలను దర్శించుకునేందుకు ఖండాంతరాలు దాటి తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు అప్పజెప్పి యాటపోతులు, కోళ్లను మొక్కుగా చెల్లించి బంధుమిత్రులు కుటుంబ సమేతంగా విందారగిస్తున్నారు. భక్తులు మూడు నాలుగు రోజులు ఇక్కడే ఉండి వనదేవతలు ఉత్సవాలు తిలకించి వన ప్రవేశం అనంతరం తిరుగు ముఖం పడుతున్నారు. భక్తులు వదిలిన వ్యర్థాలు, యాటపోతులు కోళ్ల వ్యర్థాలు దుర్వాసన దుర్గంధం వెదజల్లుతుంది. దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా తాగునీరు దొరకకపోవడంతో 50 రూపాయల నుంచి వంద రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన నీళ్లు తాగారు. ప్రభుత్వం లక్షల రూపాలు ఇచ్చిన కూడా తాగునీరు అందించని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. జాతరను కలెక్టర్ ఎమ్మెల్యే పర్యటించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని అప్పుడే బిల్లులు చెల్లించాలని భక్తులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నాసిరకము పనులు చేసి చేతులు దులుపుకొని సొమ్ము చేసుకోవాలనుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటినుంచి మళ్లీ వచ్చే జాతర వరకు శాశ్వత నిర్మాణాలు, మిగతా 9లో..

## ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 3 (జనం సాక్షి) :ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ ఐ ఆర్ ) సర్వే ప్రక్రియను త్వరగా పూర్తిచేసే విధంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తిచేయడంలో అనుసరించాల్సిన వివిధ అంశాలను గురించి జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తూ క్షేత్రస్థాయిలో ఎస్ ఐ ఆర్ సర్వే జరుగుతున్న తీరును అధికారులు, తహసిల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో ఒకటైన వరంగల్ పశ్చిమ లో ఎస్ ఐ ఆర్ సర్వే ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఎస్ ఐ ఆర్ సర్వే ప్రక్రియ తక్కువగా ఉన్న 20 పోలింగ్ కేంద్రాల పరిధిలో బి ఎల్ వో లు త్వరగా మ్యాపింగ్ పూర్తి చేసేందుకు వెరిఫికేషన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎస్ ఐ ఆర్ సర్వే మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు వెరిఫికేషన్ అధికారులుగా జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. సర్వే పురోగతి సాధించే విధంగా ఆర్డిఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ రవీందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎస్ ఐ ఆర్ సర్వేలో భాగంగా పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన చేయాలని, మ్యాపింగ్ త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిఆర్ఓ వై.వి. గణేష్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు, పాల్గొన్నారు.



## దరఖాస్తుల సమస్యలను వేగంగా పరిష్కరించండి

- ప్రజల నుండి వినతులు స్వీకరించిన కమిషనర్
- వివిధ విభాగాలకు చెందిన 79 ఫిర్యాదుల స్వీకరణ

**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** ప్రజలు అందజేసిన దరఖాస్తుల సంబంధిత సమస్యలను వేగం గా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు విభాగాల వారిగా..టౌన్ ప్లానింగ్42,ఇంజనీరింగ్19,రెవిన్యూ7, హెల్త్ ఢ శానిటేషన్7,నీటి సరఫరా3, హార్టికల్చర్1 మొత్తంగా 79 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సి హెచ్ ఓ రమేష్ ,ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య ,టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ మేకమల్ల వెంకటేష్



**నడికూడ, ఫిబ్రవరి 2 (జనం సాక్షి):**హనుమకొండ జిల్లా నడికుడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో ఉపాధి హామీ లో భాగంగా సోమవారం రోజున గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ గ్రామంలోని గార్ల చెరువులో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బొట్ల శ్రీను, కారోబార్ కుడుదుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అడవుల పరిరక్షణ అందరి బాధ్యత : జేవిఎస్ చంద్రశేఖర్

### మేడారంలో భక్తులకు విస్తృత ప్రచారం



**మంగపేట మేడారం ఫిబ్రవరి 02 (జనంసాక్షి)**సమ్మక్క, సారలమ్మ జాతరలో అటవీ శాఖ కాలేశ్వరం సంరక్షణ అధికారి ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ములుగు భూపాలపల్లి ఖమ్మం కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారులు పర్యవేక్షణలో ఖమ్మం జిల్లా కల్లూరు నివాసి గ్రీన్ వారియర్ జేవీఎస్ చంద్రశేఖర్ విస్తృతంగా మేడారం వచ్చేటువంటి భక్తులకు వన్యప్రాణులు అటవీ శాఖపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత భవిష్య త్తు తరాలలో పర్యావరణ పెంపొందించాలని ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. అలాగే సమాజంలో మానవాళి ఎదుర్కొంటున్న ప్రకృతి వైపరీత్యాలు పర్యావరణ మార్పులు దీనికి దాన కారణం మానవ తప్పిదమే వీటిని అధిగమించేందుకు అడవులను సమక్షం కావాలి అని ఆవశ్యకత ఎంతో ఉందని మేడారంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తూ భక్తులకు కరపత్రాలు పోస్టర్లు అందిస్తూ ప్రచారం చేస్తూ పలువురు దృష్టిని ఆకర్షించారు.

# ఆధ్యాత్మిక సేవలో మహిళలు



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 02 (జనం సాక్షి)** ఆధ్యాత్మిక చింతన సేవ చేయాలనే తపన ఉండి నిత్యం దేవుళ్ళ సేవలో తమ వంతు సహాయ సహకారాలు సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహబూబాబాద్ కు చెందిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నవీన్ కుమార్ అధ్యక్షతన సేవా కార్యక్రమాలను మహిళలు నిర్వహిస్తున్నారు. ఈ సేవ ట్రస్ట్ కింద సుమారు 2వేల మంది పనిచేస్తున్నారు. ప్రధానంగా మహిళలు వివిధ దేవాలయాల్లో ఉత్సవాల సందర్భంగా నే కాకుండా మామూలు సమయాల్లో కూడా అక్కడ భక్తులకు కావాల్సిన సేవల ను అందిస్తున్నారు. తిరుపతి శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ, భద్రాచలం, అయినవోలు, శ్రీ భద్రకాళి దేవాలయం, వేములవాడ, అన్నవరం, స్వర్ణ గిరి మొదలైన ప్రధాన దేవాలయాల్లో సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా భక్తులను క్యూ లైన్ లో పంపించడం, అన్నదానం, హుండీ లెక్కింపు, పూలు అల్లడం, లడ్డు ప్యాకెట్లు తయారు చేయడంతో పాటు ఆయా ఆలయాల నిర్వాహకులు ఎలాంటి పనులు అప్పజెప్పిన ఎంతో భక్తి పూర్వకంగా వీరు సేవలు అందిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా తాము తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ఎన్ని రోజులైనా సేవలు అందించడానికి సిద్ధపడుతున్నారు. దేవుని సేవలో తాము ఆనందాన్ని సంతోషాన్ని, మనశ్శాంతిని పొందుతున్నట్లు వారి పేర్కొన్నారు. తాము ఎక్కడికి వెళ్లినా ఒక గ్రూపుగా వెళ్లి అక్కడ కావలసిన సేవలు అందిస్తున్నట్లు మహిళా సేవకులు తెలిపారు.

## బాధితుడికి రూ. 27 వేల ఆర్థిక సహాయం

### ఐసిఐసిఐ బ్యాంకు ఉద్యోగుల దాతృత్వం



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 ( జనం సాక్షి):** బాధితుడికి హైదరాబాదులోని ఐసిఐసిఐ బ్యాం కు రామచంద్రపురం బ్రాంచ్ ఉద్యోగులు రూ. 27 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇదే బ్యాంకులో చెన్నారావుపేట గ్రామానికి చెందిన రాధారపు గణేష్ కుమార్ ఐ ప్రాసెస్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల చెన్నారావుపేటలోని ఈర్య తండాలో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బ్యాంకు సహోద్యోగులు మానవత్వంతో స్పందించి రూ. 27 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు బ్యాంకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు డేవిడ్ రాజ్, సంపత్ రెడ్డి, మహేష్, శిరీష, విజయ్, వంశీ, సందీప్, ప్రదీప్, పాల్గొన్నారు.

## విద్యార్థులలో చైతన్యాన్ని నింపిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 ( జనం సాక్షి):** జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ ను వరంగల్ లోని యాకుబ్ పుర టిజిటి డబ్ల్యూ ఈ ఆర్ జె సిలో ఘనంగా నిర్వహించినట్లు వరంగల్ జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షులు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి పోలెపల్లి రవిలు సోమవారంతెలిపారు. ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులలో నూతన చైతన్యాన్ని తీసుకొని రావడమే కాకుండా సబ్జెక్టుపై అభిరుచిని పెంచిందని వారు తెలిపారు. టిజిటి డబ్ల్యూ ఈ ఆర్ జె సి ప్రిన్సిపాల్ భూక్య హేమంత్ మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షలో ఈ టాలెంట్ టెస్ట్బాగా ఉపయోగపడుతుందని అన్నారు.సొంత ఖర్చులతో భోజనాలను, నగదు బహుమతులను ఇవ్వడం వలన సోషల్ ఫోరం బాధ్యులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు .ఈ పోటీలలో తెలుగు విభాగంలో మొదటి విజేతగా మహమ్మద్ షకీరా జడ్పీహెచ్ఎస్ రాయపర్తి, ద్వితీయ విజేతగా పి. ప్రణీత్ జడ్పీహెచ్ఎస్ కొత్తూరు, తృతీయ విజేతగా షేక్ ఇమ్రాన్ జడ్పీహెచ్ఎస్ చెన్నారం,ఇంగ్లీష్ విభాగంలో మొదటి విజేతగా వి.హాసినీ టిఎస్ఆర్ఎస్ నెక్కొండ, ద్వితీయ విజేతగా మహమ్మద్ ముదసిర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రిష్ణ కాలనీ, తృతీయ విజేతగా బి. వినయ్ జడ్పీఎస్ఎస్ లింగాపురంవిజేతలుగా నిలిచినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్ తేజ, జిసిడిఓ ఫ్లోరెన్స్, డి సి ఈ బి సెక్రటరీకృష్ణమూర్తి , ఏ సి జి అరుణ , సోషల్ ఫోరం కోశాధికారి ఆమంచ రవికుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా సోషల్ ఫోరం గౌరవ అధ్యక్షులు మంగ రాజన్న, అసోసియేట్ అధ్యక్షులు సాంబమూర్తి, భూపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు బిక్షపతి, చిట్టిబోతుల సంపత్, గుడివాడ అశోక్, చిలువేరు శ్రీనివాస్, హరిలాల్, రాజేందర్, మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, తల్లిదండ్రులు, గైడ్ టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలకాలి:ఏసీపీ రవికుమార్



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 02(జనంసాక్షి):** మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్, మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు సోమవారం మందమర్రి సీఐ కార్యాలయ ఆవరణలో కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరై మాట్లాడుతూ క్షణికావేశం, మద్యం మత్తులో నేరాలకు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించిందని గుర్తు చేశారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు నేరప్రవృత్తిని పూర్తిగా మానేసి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గొడవలు, ఆందోళనలకు పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నడవడికలో మార్పు రాకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అనంతరం మందమర్రి సీఐ రమేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి రౌడీ షీటర్, పాత నేరస్తుడు నేరప్రవృత్తిని విడిచిపెట్టి మంచిగా జీవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్, మందమర్రి ఎస్సై నరేష్తో పాటు సుమారు ముప్పది మంది రౌడీ షీటర్లు, పాత నేరస్తులు పాల్గొన్నారు.

## నాగపూర్ గ్రామపంచాయతీ లో క్రికెట్ పోటీలు ప్రారంభం

**సారంగాపూర్,ఫిబ్రవరి2(జనం సాక్షి)**సారంగాపూర్ మండల పరిధిలోని నాగపూర్ గ్రామపంచాయతీ దేవి నగర్ తండాలో జాదవ్ ప్రకాష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి 30 వేలు రెండవ బహుమతి 15 వేలు గా ప్రకటించారు. గ్రామంలో ప్రీమియర్ లీగ్ పోటీలు స్థానిక నాయకులు హాజరై పోటీలో పాల్గొంటున్న యువకులకు జెర్సీలను అందజేశారు. పోటీల్లో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాదవ్ లలితా కైలాష్, అడెల్లి చైర్మన్ సింగం భోజ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ ఐర నారాయణరెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నరసయ్య, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జాదవ్ దిలీప్ అడెల్లి సర్పంచ్ దండు సాయన్న, సారంగాపూర్ సర్పంచ్ కునేరు భూమన్న, మాజీ ఎంపీపీ అట్ల మైపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ్ మహమ్మద్, దావుజి నాయక్, రోడ్డ మారుతి, జగదీశ్వర్, నారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి02(,జనంసాక్షి)** రానున్న గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపటాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో పుష్కర ఘాట్ల వారీగా ఏర్పాట్లపై సమీక్షించారు.బాసర పుష్కర ఘాట్కు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ఘాట్ వద్ద పార్కింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, వైద్య శిబిరాలు, మెరుగైన రోడ్డు సదుపాయం, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సవంగా ఉపాధి హామీ పనులు ప్రారంభం



**సారంగాపూర్,ఫిబ్రవరి2 (జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలోని కౌట్ల బి గ్రామపంచాయతీ పరిధిలో, సోమవారం ఉపాధి హామీ పనులను స్థానిక సర్పం చులు బల్గురి అజయ్,ఉప సర్పంచ్ ఇప్ప శ్రీకాంత్ రెడ్డి ,పంచాయతీ కార్యదర్శి సుధాకర్,ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ మెట్ రమణ నాయకులు స్థానిక గ్రామ పంచాయతీ పాలకవర్గం తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనిని వినియోగించుకోవాలని తెలిపారు.

## నిన్న బిఆర్ఎస్‌లోకి నేడు సొంత గూటికి కాంగ్రెస్‌లోకి చేరిన దస్రు తండా ప్రజలు



**తొర్రూరు ,ఫిబ్రవరి 2 (జనం సాక్షి) :** తొర్రూరు పట్టణం 13వ వార్డు పరిధిలోని దస్రు తండాకు చెందిన ప్రముఖ నాయకులు భూక్య దశ్రు నాయక్, భూక్య భాస్కర్ నాయక్, భూక్య యాకూబ్ నాయక్ లతో పాటు సుమారు 30 కుటుంబాలు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని అధికారికంగా పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ విధానాలు, నాయకత్వంపై విశ్వాసంతోనే తాము తిరిగి సొంత గూటైన కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు దశ్రు తండా ప్రజలు తెలిపారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నిన్న మాజీ మంత్రి మాయమాటలు చెప్పి మా కాంగ్రెస్ పార్టీ నాయకులను బిఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకున్నారని, అయితే వాస్తవాలు గ్రహించిన నాయకులు ఈరోజు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు.ఇష్టం లేకున్నా బిఆర్ఎస్ కండువాలు కప్పించారని, కానీ ఈరోజు మాత్రం అందరూ స్వచ్ఛందంగా, పూర్తి ఇష్టంతోనే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారని వాసు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీనే ప్రజల పార్టీ అని, దశ్రు తండా ప్రజలు మరోసారి అది నిరూపించారని వారు అన్నారు. దశ్రు తండాలో బిఆర్ఎస్‌కు ప్రజాధారం పూర్తిగా కోల్పోయిందని, కాంగ్రెస్ పార్టీ బలం రోజురోజుకు పెరుగుతోందని ఈ చేరికలు స్పష్టంగా తెలియజేస్తున్నాయని ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి బసనబోయిన ఐలమ్మ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారిని ఘనంగా స్వాగతించారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి



### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 2 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను నిర్ణీత గడువులో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజలు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యలను వివరించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సీరియస్‌గా పరిగణించి పక్షం రోజుల్లోగా తీసుకున్న చర్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌ను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలను డీఆర్‌ఓకు అందజేయాలని అధికారులను సూచించారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు ? అధ్యాపకుల పనితీరు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని తెలిపారు.స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, 8వ తరగతి నుండి 12వ తరగతి వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు

## రైతులు యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అనురాధ



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 ( జనం సాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అనురాధ అన్నారు. సోమవారం చెన్నారా వుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలోని ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల యూరియా కష్టాలు చూడలేక యూరియా బుకింగ్ యాప్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాప్ లో ఎరువుల డీలర్ల వద్ద యూరియా స్టాక్ ఎంత ఉంది అనేది స్పష్టంగా కనబడుతుందన్నారు. తమ స్మార్ట్ ఫోన్లో ఇంట్లో కూర్చుని కూడా యూరియా బస్తాలు బుక్ చేసుకొని పొందవచ్చన్నారు. ఈ యాప్ లో ప్రస్తుత యాసంగి సీజన్ లో సాగు చేసిన పంటల విస్తీర్ణ వివరాలను నమోదు చేసుకొని తమకు నచ్చిన లేదా తమకు దగ్గరలోని డీలర్ వద్ద యూరియా బస్తాలు బుక్ చేసుకోవచ్చన్నారు. బుక్ చేసుకున్నాక 24 గంటల్లోపు యూరియా బస్తాలు పొందవచ్చని తెలిపారు. మిగతా వివరాల కోసం తమ వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో వెంకట శివానంద్, మండల వ్యవసాయ అధికారి చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చెన్నారావుపేటలో మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్

**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 ( జనం సాక్షి ):** నేడు మంగళవారం చెన్నారావుపేటలో మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, మండల విద్యాశాఖ అధికారిని సరళ సోమవారం తెలిపారు. సీఎం కప్ రెండవ ఎడిషన్ చెన్నారావుపేట మండల స్థాయి క్రీడా పోటీలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ క్రీడలను మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఉన్నటువంటి ఐదు క్లస్టర్ ( జల్లి, ఉప్పరపల్లి, చెన్నారావుపేట, పాపయ్యపేట, అమీనాబాద్ )లో ఆన్ లైన్ చేసుకున్న క్రీడాకారులు ఉదయం 9 గంటలకు సిద్ధార్థ హై స్కూల్ లో రిపోర్ట్ చేయాలని వారు కోరారు.

## టి ఫైబర్ ఇంటర్నెట్ సదుపాయాన్ని వెంటనే కల్పించాలి



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 ( జనం సాక్షి ):** టి ఫైబర్ ఇంటర్నెట్ సదుపాయం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని చెన్నా రావుపేట ఈ గ్రామ పంచాయతీ ఆపరేటర్లు రమేష్, ప్రణవ్, సందీప్ లు కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకట శివానంద్ కు వినతి పత్రా న్ని అందించారు. గత రెండు నెలలుగా టి ఫైబర్ ఇంటర్నెట్ రాకపోవడంతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా పాలన దరఖాస్తు అభ్యంతరాలు, పింఛన్లు, ఈ పంచాయతీ పనులు, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇళ్ల నిర్మాణాల అనుమతులు, ఆస్తి మార్పిడి లాంటి మొదలైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో గ్రామాలలోని ప్రజలు మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారికి సమాధానం చెప్పలేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే టి ఫైబర్ టెక్నికల్ జిల్లా టీం పెద్దలతో మాట్లాడి ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరారు.

## తాడిచర్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

### మండల అధ్యక్షులు బడితేల రాజయ్య



**మల్హర్,ఫిబ్రవరి02(జనంసాక్షి)**కేంద్రప్రభుత్వం ఎంజి ఎన్ ఆర్ఈజిఎస్ పథకాన్ని రద్దుపరిచి దాని స్థానం లో విబిజి రామ్ జి అనే పథకాన్ని తెచ్చి,గ్రామీణ నిరుపేదల ,స్థానిక సంస్థల హక్కులను,అధికారాలను కాలరాస్తున్న ందున ఇట్టి అంశంపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఐ టి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు,తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జయశంకర్ డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్ సూచన మేరకు,ఈ జి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ బాధ్యతలను అనుసరించి మంగళవారం రోజున ఉదయం 10.00 గంటలకు మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల లోని ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన మరియు ధర్నా కార్యక్రమం ఉంటుంది అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బడితేల రాజయ్య తెలిపారు.కాంగ్రెస్ పార్టీలోని అన్ని విభాగాల నాయకులు,కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,ఉపాది హామీ కూలీలు,మహిళ సంఘాలు ప్రతి ఒక్కరు హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కొరడమైనది.

## సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎన్సిసి యూనిట్ మంజూరు



**సారంగాపూర్ ఫిబ్రవరి 2 (జనం సాక్షి)** నిర్మల్ జిల్లా సారంగపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎన్సిసి యూనిట్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కందూరి శంకర్ తెలిపారు ఎన్సిసి యూనిట్ మంజూరూ అవ్వడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు దేశభక్తి మరింతగా పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నప్పటికీ, వాటిలో మన సారంగపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎన్సిసి యూనిట్ మంజూర అవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్సిసి యూనిట్ మంజూరైన వాటిలో ఇది రెండో కళాశాలగా నిలిచిందని వివరించారు.మొదటిగా హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎన్సిసి యూనిట్ మంజూరు కాగా, ఆ తరువాత సారంగపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎన్సిసి యూనిట్ మంజూరైనట్లు ఆయన తెలిపారు.

## పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం ఆడే గజేందర్



**బోథ్,ఫిబ్రవరి 02 (జనం సాక్షి)**పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ అడే గజేందర్ అన్నారు .సోమవారం బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్ రోహిణి వినయ్ రెడ్డి తో కలిసి భూమి చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో విద్యకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంగయ్య,రాజు యాదవ్,మహేందర్, ఉమేష్, నారాయణ,నరసింహదాస్, చంటి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణ

### డిప్యూటీ తహసీల్దార్ భూమేశ్వర్



**మల్హర్, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** జనంసాక్షి తెలుగు దిన పత్రిక 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను డిప్యూటీ తహసీల్దార్ భూమేశ్వర్ రావు సోమవారం రోజున తాడిచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుచు నిజాలు నిర్భయంగా రాసే పత్రికాలే సమాజ అభివృద్ధికి పాటుపడతాయి అని అన్నారు.ప్రజల కు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిరంతరం వార్త కథనాలతో వార్త పత్రికలు ప్రజలకు చైతన్యము కలిగిస్తాయి అని అన్నారు. జనం సాక్షి మరింత మెరుగైన వార్తలు రాస్తూ సమాజానికి మార్గదర్శి కంగా ఉండాలి అని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, నాచారం వార్డు సభ్యులు రాజు, పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన రాజోలు విద్యార్థులు



**కురవి, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సోషల్ స్టడీస్ ఫోరం , గాంధీ జ్ఞాన ప్రతిష్ట ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా స్థాయిలో సోషల్ స్టడీస్ జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ గవర్నమెంట్ హై స్కూల్ మహబూబాబాద్ నందు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా కస్తూరిబా పాఠశాలలు, మోడల్ స్కూల్, ప్రభుత్వ మరియు లోకల్ బాడీ కి చెందిన సుమారు 81 పాఠశాలలు ఇందులో పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా తెలుగు మీడియం విభాగంలో జడ్పీహెచ్ఎస్ రాజోలు పాఠశాలకు చెందిన ఎలగం విష్ణు ప్రియ జిల్లాస్థాయి ప్రథమ స్థానంలో నిలువగా, ఇదే పాఠశాలకు చెందిన ఎలగం ఉదయ్ కిరణ్ జిల్లా స్థాయి ఇంగ్లీష్ మీడియం విభాగంలో రెండవ స్థానంలో నిలిచి బహుమతులు , ప్రశంస పత్రాలు అందుకున్నారు. అంతే కాకుండా ఈ నెల 8వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ కు మహబూబాబాద్ జిల్లా నుంచి వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరికి గైడ్ టీచరుగా సాంఘిక ఉపాధ్యాయుడు ఎం కిషన్ ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో కూడా ఉన్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించాలని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్ రాఘవేందర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దామోదర్, మోహన్, బీకుచోహన్, సురేష్ రవికుమార్, రాజేశ్వరి, వసంత, కాశీనాథ్ .భవాని, నరేష్, రజనీ, రాణి, ప్రభాకర్, ప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

## ముజ్గి మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ రూరల్, ఫిబ్రవరి2 (జనంసాక్షి):** నిర్మల్ గ్రామీణ మండలంలోని ముజ్గి మల్లన్న జాతర సందర్భంగా మల్లన్న ఆలయంలో నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అశ్వత్థామ,రాజేశ్వర్, ముత్యం, శ్రీనివాస్,జమాల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

### జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్ తేజ

**చెన్నారావుపేట, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్ తేజ అన్నారు.చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట కాంప్లెక్స్ లో జరుగుతున్న ప్రైమరీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు.అలాగే బోజేర్వు ప్రాథమికోన్నత పాఠశాల, పాపయ్య పేట ప్రాథమిక పాఠశాల, నాయక్ పోడు కాలనీ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్శనలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు .ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు విధిగా హాజరు కావాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎస్ స్టడీ సర్వే కు సంబంధించిన మాక్ పరీక్షలు లను విధిగా విద్యార్థులకు నిర్వహించాలని తెలిపారు. అలాగే హైస్కూల్ స్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఫిబ్రవరి 26 న ఎస్ సి ఈ ఆర్ టి వారు మూడవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఎఫ్ ఎల్ ఎస్ స్టడీ సర్వే పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని తెలిపారు.పదవ తరగతి వార్షిక పరీక్షలులలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉల్లాస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సిహెచ్ నాగేశ్వర రావు, మండల విద్యాశాఖ అధికారిణి బైరి సరళ, పాపయ్య పేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోయినపల్లి ప్రభాకర రావు, రిసోర్స్ పర్సన్లు బానోతు వెంకన్న, రవి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగుల శ్రీనివాస్, రవీందర్, పూజారి సురేందర్, పత్తి నర్సింహారెడ్డి, కట్టస్వామి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఉమాదేవి, స్వామి, మాధవి, పద్మ, ఈర్య, రమేష్ , రాజు, ఆంజనేయులు, రామాచారి, సీఆర్పీలు బాలు, సంపత్, స్వామి పాల్గొన్నారు.



# పాత పెన్షన్(ఓపిఎస్)విధానాన్ని అమలు చేయాలి

- సిపిఎస్ ఉద్యోగుల పెండింగ్ డీఏ వాయిదాల బకాయిలను వెంటనే చెల్లించాలి
- టిఎస్సిపిఎస్ఈయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవిచంద్ర డిమాండ్



**గూడూరు,ఫిబ్రవరి 02(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ వాయిదాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోనబోయిన రవిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు మండలంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వాయిదాల రూపంలో చెల్లించడం బాధాకరమని,ప్రభుత్వం సకాలంలో వీటిని చెల్లించకుండా వాయిదాల సంఖ్యను పెంచుకుంటూ పోవడం వల్ల ప్రస్తుతం అవి 60కి చేరాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాయిదాల ద్వారా రావలసిన మొత్తం సుమారు 1200 కోట్లకు చేరడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న 700 కోట్ల నిధులలో భాగంగా ఈ నెల తప్పనిసరిగా సీపీఎస్ బకాయిల కోసం కేటాయించాలని అయన కోరారు.అలాగే గత ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని (ఒపీఎస్) అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిఎస్సిపిఎస్ఈ యు మండల అధ్యక్షులు జి. మల్లేశం,ప్రధాన కార్యదర్శి మనోహర్,జి.చంద్రమౌళి,షాహిద్ అలీ,ఆర్.లక్షపతి,వెనుక విజయ్, మడిపెద్ద శీను,డి.రమేష్,ఎన్ కుమార్ స్వామి,గట్టు రజిత, స్ఫూర్తి వాహిని, సుస్మిత, ఉమామహేశ్వరి,ఎన్.ఉష, రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాంబాబు కుటుంబాన్ని అన్ని విధాల అనుకుంటాం

### రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



**మంగపేట ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** విద్యుత్ శాఖలో చాలా ఏళ్లుగా విధులు నిర్వహించి గుండెపోటుతో అకాల మరణం చెందిన కమలాపురం గ్రామవాసి బూర రాంబాబు మృతి విద్యుత్ శాఖకు తీవ్రమైన లోటని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. సోమవారం మండలంలోని కమలాపురంలో బూర రాంబాబు దశదినకర్మకు సోమయ్య హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రూ. 12 వేల రూపాయల నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ విద్యుత్ శాఖలో నిత్యం విద్యుత్ కోత సమయంలో వెంటనే స్పందించి కరెంటు సరఫరా చేయించి గ్రామస్తులకు నాణ్యమైన విద్యుత్తును అందించే రాంబాబు గుండెపోటుతో విధి నిర్వహణలో అకాల మరణం పొందడం తీరని లోటు అన్నారు. రాంబాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకొనుటకు తన వంతు కృషి చేస్తానని సోమయ్య ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మల రాంబాబు యాదవ్, మేడిపల్లి వెంకటేశ్వర్లు, బట్టరుశెట్టి గౌతం కుమార్, బూర లక్ష్మీ నారాయణ, తూడి భగవాన్ రెడ్డి, సదానందం, పడమటింటి శ్రీనివాస్, చింత పున్నారావు, బండారి వెంకటేశ్వర్లు, బూర నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికి తీయడానికే సీఎం కప్ క్రీడలు

### సర్పంచ్ కుడ్ల మల్హల్ రావు

**నడికూడ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడుతాయని నడికూడ గ్రామ సర్పంచ్ కుడ్లమలహాల్ రావు అన్నారు. సోమవారం నడికూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని,వారి ప్రతిభను చాటేలా విద్యార్థులు సీఎం కప్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు.మండల,జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించి విద్యార్థులు మండలానికి మంచి గుర్తింపుతీసుకు రావాలని ఆకాంక్షించారు.ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారికె. హనుమంత రావు,మండల పరిషత్ అధికారి మార్గవి రెడ్డి,సీఎం కప్ మండల ఇంచార్జివెంకన్న,ఉప సర్పంచ్ టి.సంపత్,ఎస్.జి.యఫ్.ఐ సెక్రెటరీ ఆర్.సుభాష్,మండలంలోని వివిధ పాఠశాల నుండి వచ్చిన క్లస్టర్ ఇన్చార్జులుపీ.డీలు,పీ.ఈ.టీలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



### ముగిసిన సాయి పారాయణం...

# మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు



**నిర్మల్ రూరల్, (జనంసాక్షి):** పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గత వారం రోజులుగా కొనసాగిన మహా సాయి పారాయణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయిబాబాకు అభిషేకం, హారతి అనంతరం పట్టణ పురవీధుల గుండా సాయి పల్లకి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.పలు కాలనీలకు చెందిన మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.మధ్యాహ్న హారతి అనంతరం పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పారాయణ ఉత్సవంలో వారం రోజులపాటు భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించారు.ఈ సందర్భంగా సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా ప్రతిరోజు ఉదయం,సాయంత్రం వేళల్లో నిర్వహించిన పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయి చరిత పఠనాన్ని పూర్తి చేశారని తెలిపారు. సాయి పారాయణం పూర్తి చేసిన భక్తులకు వారు కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతారన్నారు.ఈ కారణంగానే గత 12 ఏళ్లుగా ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు మార్గాన్ని వదిలి సన్మార్గంలో నడిచేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో కూడా సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలతో పాటు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవాసమితి సభ్యులు ఉప్పుల నందు,రాజేష్, రాంరెడ్డి,పండరి, శ్రీనివాస్, నారాయణరెడ్డి,లక్ష్మణ్, మనోహర్, మహేందర్, రేఖ,రమ తోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్**




**బెల్లంపల్లి, ఫిబ్రవరి 2, (జనంసాక్షి) :** కేంద్ర బడ్జెట్ దేశ రైతాంగాన్ని తీవ్ర నిరాశ పరిచిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతాంగం చేస్తున్న డిమాండ్ల పట్ల కేంద్ర బడ్జెట్ లో వ్యక్తం కాలేదన్నారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయానికి, గ్రామీణ అభివృద్ధికి కేవలం 13% నిధులను మాత్రమే కేటాయించటం శోచనీయం అన్నారు. పెట్టుబడిదారుల కోసం, పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి ఇవ్వలేదన్నారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి ఎకరాకు 18000 కేటాయించాలని, రుణమాఫీ చట్టం చేయాలని, పంటల మద్దతు ధరలను సి 2o50 శాతం ప్రకారం నిర్ణయించాలని అన్నారు. బీమా పథకం అమలు చేయాలని, ఎరువుల సబ్సిడీ పెంచాలని, 15 కోట్ల మంది రైతులు పంటలను సాగు చేయటానికి అనుకూల పరిస్థితులను ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ వ్యవసాయాన్ని కొనసాగించే వారికి మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఐసిఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు, వ్యవసాయ పరిశోధనలకు సంబంధించి కేటాయించిన 6200 కోట్లు గత బడ్జెట్ కంటే తక్కువ అన్నారు. రైతులను ముఖ్యంగా చిన్న, సన్నకారు మధ్యతరగతి రైతులను దెబ్బతీయటానికి ఉద్దేశింప బడిన బడ్జెట్ అన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చిన్న, సన్న కారు రైతుల ఆర్థిక స్తోమత పెంచటానికి చర్యలు తీసుకుంటామని చెప్పటం దారుణమైన మోసం అన్నారు. అధిక విలువ వచ్చే కోకోనట్, కోకో, గంధపు చెట్లకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించడం దారుణం అన్నారు. ఈ పంటలను పండించే రైతులు అతి తక్కువ శాతంలో ఉన్నారని, 15 కోట్ల మంది రైతాంగానికి ఉపయోగపడే ఏ ఒక్క చర్య తీసుకోలేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి చెప్పినట్లు 7 శాతం అభివృద్ధితో దేశం ముందుకు వెళుతుంటే మానవ అభివృద్ధిలో మన దేశం 2 వందల దేశాలలో 138వ స్థానంలో ఎందుకు ఉందని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసుకుంటూ కేవలం రాజకీయ అధికారాన్ని కాపాడుకోవడానికి మాత్రమే పాలకుల విధానాలు ఉన్నాయన్నారు. రైతు వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

– గేట్ మీటింగ్లో కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు.




**బెల్లంపల్లి, ఫిబ్రవరి 2, (జనంసాక్షి):** ఈనెల 12న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి శాంతిఖని గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్లో పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరిం చుకోవాలని అన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ నాలుగు లేబర్ కోడ్లో కార్మికులకు ఉన్న హక్కులను కాలరాయడం తప్ప కార్మిక వర్గానికి ఉపయోగ కరంగా లేవని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఇప్పటికే ఎన్డీఏయేతర ప్రభుత్వాలు అమలు జరుపబోమని ప్రకటించా రని, రాష్ట్రాలలో తిరస్కరించిన వాటిని అమలు చేయవద్దని అన్నారు. చట్ట వ్యతిరేకమైన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని సమ్మెను విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఠాకూర్ మణిరామ్ సింగ్, నాయకులుఎండి చాంద్ పాషా, అంబాల మహేందర్, నీరటి రాజన్న, పోచ మల్లు, గోగర్ల శంకర్, బొల్లు మల్లయ్య, ఎన్నం శంకర్, దుగ్గుట లింగయ్య, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యాన్ని గ్రామంలోనే పంపిణీ చేయాలి

– సర్పంచ్ అశోక్



**చిట్యాల, ఫిబ్రవరి 02(జనంసాక్షి):** రేషన్ బియ్యాన్ని తమ గ్రామంలో పంపిణీ చేయాలని మండలంలోని ఎలేటి రామయ్య పల్లి గ్రామ సర్పంచ్ కొడారి అశోక్ కోరారు. ఈమెరకు సోమవారం తహసిల్దార్ కు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామం గత ఆరు ఏళ్లుగా గ్రామపంచాయతీగా ఏర్పడిందని తెలిపారు.160 రేషన్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికీ చిట్యాల మండల కేంద్రంలోని 26వ రేషన్ షాపు నుండి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తమ గ్రామానికి మండల కేంద్రం రెండు కిలోమీటర్ల వ్యత్యాసంలో ఉంటుందని, వృద్ధులు, వితంతువులు, కార్డుదారులు అనేక ప్రయాసాలకు ఓర్చి మండల కేంద్రం నుండి రేషన్ బియ్యాన్ని తీసుకు వస్తున్నట్లు వివరించారు. రేషన్ బియ్యం కోసం తమ గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి, గ్రామములో రేషన్ బియ్యం ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.కాగా స్పందించిన తహసిల్దార్ ఇమామ్ బాబా షేక్ రేషన్ బియ్యం పంపిణీ కోసం గది ఇప్పిస్తే తప్పకుండా గ్రామంలోనే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తానని సర్పంచ్ అశోక్ కు హామీ ఇచ్చారు. అనంతరం నూతన సర్పంచిగా ఎన్నికైన కొడారి అశోక్ తహసిల్దార్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్యాల మాజీ ఎంపీటీసీ గుర్రపు తిరుపతి, గ్రామస్తులు ఏలేటి శ్రీనివాస్, మర్రి నరేష్, చింతల తిరుపతి, తదితరులు ఉన్నారు.

## మాజీ ఉప సర్పంచును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 2, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్ర మాజీ ఉప సర్పంచ్ గడ్డం స్వామి గౌడ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం స్వామి కుటుంబాన్ని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరామర్శించారు. బిఆర్ఎస్ నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించి, మనోధైర్యం అందించారు. ఆయన వెంట నెన్నెల సర్పంచ్ ఇబ్రహీం, నాయకులు గడ్డం బీమా గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నిరంజన్ గుప్తా, పూదరి అంజన్న గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అనారోగ్యంతో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 2, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లింగంపల్లి చంద్రయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాకా వెంకటస్వామి వీరభిమాని అయిన చంద్రయ్య కాంగ్రెస్ పార్టీలో తనదైన ముద్ర వేశారు. కాంగ్రెస్ పార్టీ అంటే చంద్రయ్య, చంద్రయ్య అంటే కాంగ్రెస్ పార్టీ అనే లాగా ఉండేవాడు. అచ్చం కాంగ్రెస్ నాయకుడు ఎలా ఉండాలో అలా ఉండేవాడు. నెత్తిన టోపీ, ఖద్దరు లాల్చీతో ప్రత్యేక ఆహార్యం కలిగి ఉండేవాడు. బెల్లంపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి గడ్డం వినోద్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి చిరపరిచితుడు. రాజకీయ చైతన్యం ఉన్న చంద్రయ్య ప్రతి ఎన్నికల్లో పోటీ మండలంలో ప్రత్యేక రికార్డు సృష్టించాడు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రయ్య పార్థివ దేహాన్ని నెన్నెల సర్పంచ్ ఇబ్రహీం, కాంగ్రెస్ నాయకులు గట్టు బానేష్, కంపెల రమేష్ నివాళులు అర్పించారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫారాలు అందజేత

- గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- డిసిసి అధ్యక్షుడు బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ పురపాలిక ఎన్నికల్లో బరిలో నిలువనున్న అభ్యర్థులకు పార్టీ గుర్తింపు బీఫారములను అందజేశారు. అభ్యర్థులకు బీఫారాలను అందజేసిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొజ్జు పటేల్ మాట్లాడారు. పార్టీలోని కార్యకర్త, నాయకుడు తేడా లేకుండా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. వైషమ్యాలను పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను తీసుకెళ్లి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నిర్మల్, బైంసా, ఖానాపూర్ మునిసిపల్ కేంద్రాల లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మూడు మునిసిపాలిటీల్లో చైర్మన్ కుర్చీ కాంగ్రెస్ పార్టీకి దక్కుతుం దని ఈ సందర్భంగా బొజ్జు పటేల్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోపార్టీ శ్రేణులు, బరిలో నిలిచిన అభ్యర్థులు, పాల్గొన్నారు.

## సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రధానం




**నడికూడ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడోత్సవాలు మొదటి రోజున మండల కేంద్రం లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు.కబడ్డీ,వాలీబాల్, ఖోఖో క్రీడలను విజయవంతంగా నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు సీఎం కప్పు ప్రైజ్ లను ఎంపీఓ మార్గవి రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హనుమంత రావు, ఎస్‌జిఎఫ్‌ఐ సెక్రటరీ సుభాష్,పి డి ఉశి వకుమార్,రాంబాబు,ప్రేమానందం,ప్రతిమారాని,సరోజన, గోవింద నవీన్ కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ మల్లేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ అశోక్



**చిట్యాల, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** మండలంలోని ఏలేటి రామయ్య పల్లి నూతన సర్పంచ్ కొదారి అశోక్ సోమవారం సీఐ మల్లేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట టేకుమట్ల మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, గుర్రపు తిరుపతి, గ్రామస్తులు ఎ లేటి శ్రీనివాస్, మర్రి నరేష్, కొదారి కొమురయ్య, చింతల తిరుపతి, గోపాలపురం నాయకుడు శ్రీనివాస్ ఉన్నారు.

# ప్రజా కంటక కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

- వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు బడ్జెట్ పెంచాలి
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్..
- వరంగల్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం – నిరసన



**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే విధంగా ఉందని తక్షణమే బడ్జెట్ ను సవరించి దేశీయ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి గ్రామీణ మౌలిక సదుపా యాలకు ఉపాధికి నిధులను పెంచాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంసిపిఐ(యు) వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ వరంగల్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంసిపిఐ (యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వికసిత్ భారత్ పేరుతో ప్రచార ఆర్భాటం చేస్తూ లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఆచరణలో సంస్కరణల వేగవంతం పేరుతో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగాలను సంపదను ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్ర పన్నిందని ఈ క్రమంలో పట్టణీకరణ పేరుతో వివిధ రకాల సేవలను రద్దుచేసి కమర్షియల్ గా మార్చి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి రంగాలైన రైతుల వ్యవసాయాన్ని దేశీయ పరిశ్రమలను దివాలా తీయించే విధంగా విధానాలను రూపొందించి కార్పొరేట్ వ్యవసాయాన్ని విదేశీ పెట్టుబడుదారులను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అన్నారు. గ్రామీణ ఉపాధికి మౌలిక సదుపాయాలకు తగిన విధమైన కేటాయింపులు జరపకపోవడం సిగ్గుచేటు అన్నారు. బడ్జెట్లో దేశ ప్రయోజనాలకు అభివృద్ధికి అనుగుణంగా సమతుల్యత పాటించి కేటాయింపులు జరపాలని ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు ఐతం నాగేష్, మహమ్మద్ మెహబూబ్ పాషా, పరిమళ గోవర్ధన్ రాజు నగర నాయకులు మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య నలివెల రవి జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సర్వే



**పెద్దవంగర; ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** సమస్యల పరిష్కారానికి సర్వే సర్పంచ్ దంతాలపల్లి పరుశురాములు,అన్నారు. సోమవారం మండలం లో వడ్డేకొత్తపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పరమేశ్వర్ గ్రామ సమస్యల పరిష్కారం కోసం సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఇంటింటికి ప్రత్యక్షంగా వెళ్లి సమస్యలను రికార్డ్ చేసి వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుటకు తొలి అడుగు గా ముందుకు వెళుతున్నామన్నారు.ఇది నిరంతర ప్రక్రియ అని గ్రామంలో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ ఎర్రగొల్ల రమేష్, వార్డ్ మెంబర్స్ దంతాలపల్లి లక్ష్మి, దండుగుల సంధ్య శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ హరీష్, కారోబార్ పరుశురాం, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 4 నుండి ముధోల్ నియోజకవర్గంలో సీఎం కప్ క్రీడా పోటీలు

**ముధోల్ ఎంపీడీవో లవ్ కుమార్**

**ముధోల్, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించబడే సీఎం కప్ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు అనగా 4 ఫిబ్రవరి 2026 మరియు 5 ఫిబ్రవరి 2025 తేదీలలో నిర్వహించబడతాయ నీ ముధోల్ ఎంపీడీవో లావు కుమార్ తెలిపారు. ఈ పోటీలు మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల (బాయ్స్) ప్రాంగణంలో జరగనున్నాయ నీ, ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సీఎం కప్ పోటీలకు తప్పనిసరిగా హాజరై తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి పోటీలను విజయవంతం చేయాలని ,క్రీడాకారులు నిర్ణీత సమయంలో హాజరై, క్రమశిక్షణ పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.




## వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు మూడు బాలు చౌహాన్**



**కురవి, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** మహబూబాబాద్ మునిసిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మూడ్ బాలు చౌహన్ కురవి భద్రకాళి సామెత వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మహబూబాబాద్ మునిసిపాలిటీలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధించాలని స్వామి వారిని ప్రార్థించారు. అనంతరం మీడియాతో బాలు చౌహాన్ మాట్లాడుతూ మహబూ బా బాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బలంగా మారతాయని అన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునిసిపాలిటీల అభివృద్ధి కోసం వచ్చిన నిధులను దొడ్డిదారిన మళ్లించి, మునిసిపల్ అభివృద్ధిని అడ్డుకుందని బాలు చౌహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కారణంగా పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కుంటు పడింద న్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ అభివృద్ధి విధానాలే మున్ని సిపాలిటీల్లో పార్టీ విజయానికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహ బూబాబాద్ మునిసిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేస్తూ, ప్రజల ఆశీర్వాదంతో అభ్యర్థుల ఘన విజయం కోసం పాటు పడాలని బాలు చౌహాన్ కోరారు.

## బిఆర్ఎస్‌లో చేరికల జోరు



**పరకాల, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల వేళ పరకాల పట్టణంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. సోమవారం పరకాల మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాల రవీందర్ రెడ్డి, 2వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులుటూటా మాజిక్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బొచ్చు సంపత్,సోషల్ మీడియా కన్వీనర్ బొచ్చు వరప్రసాద్,బూత్ ఇంచార్జ్ బొచ్చు సుభాష్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ చేరికలు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పరకాల మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి సమక్షంలో జరిగాయి.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పరకాల పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీనే సరైన వేదిక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 4న సిఎం కప్పుమండల స్థాయి పోటీలు

**మహా ముత్తారం ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** సిఎం కప్పు 2 ఎడిషన్ లో భాగంగా మహాముత్తారం మండలంలో మండల స్థాయి సిఎం కప్పు పోటీలుఈనేల 4 ఫిబ్రవరి 2026 నాడు మహాముత్తారం నందు నిర్వహించడం నిర్వహించడం జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్లస్టర్ స్థాయి నుంచి గెలిచిన విజేతలకు కబడ్డీ,వాలీబాల్, కోకో తదితర క్రీడలను పి.డి.ల ఆధ్వర్యం లో పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా స్థాయి కి పంపడం జరుగు తుంది,కావున పాల్గొనే క్రీడాకారులు అందరూ క్రీడా స్ఫూర్తి తో ఆడి ఈ పోటీలు విజయవంతం చేయాలి అని మండల అభివృద్ధి అధికారి నిశాంత్, తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి రవీందర్ రెడ్డి లు ఒక ప్రకటనలో తెలిపారు.

కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి కోటి ఆర్థిక సాయం అందించాలి

## రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి



**స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 02 (జనంసాక్షి) :** నిజాంబాద్ జిల్లాలో ఎక్సైజ్ కాని స్టేబుల్ పద్మశాలి ముద్దుబిడ్డ సౌమ్య వీధి నిర్వహణలో గంజాయి ముఠాచేతిలో మృతి బాధాకరమని,ఆమె కుటుం బానికి కోటి రూపాయల ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో సోమ వారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికా రిపై మత్తు లో ఉన్న గంజాయి స్మగ్లర్లు దాడులకు తెగబడడం ఆందోళ నకర మని అన్నారు. మత్తు పదార్థాల రవాణా వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.ఆమె మృతికి కారుకులైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన వారు బిజెపి కార్యకర్తలు కాదు

### పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్



**పరకాల, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆది వారం పరకాల పట్టణం 22వ వార్డు నుంచి బీజేపీకి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పుకోవడం పూర్తిగా అవాస్తవమని బీజేపీ పర కాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఒక్కరికి కూడా బీజేపీలో కనీస సభ్యత్వం కూడా లేదని తెలిపారు. బీజేపీతో ఏ విధమైన సంబంధం లేని వారిని బీజేపీ నేతలుగా చిత్రీకరించి కాంగ్రెస్‌లో చేర్చుకున్నామని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించేప్రయత్నమేనన్నారు.నిజానిజాలు తెలుసుకోకుండా, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం ప్రజాస్వామ్యానికి తగదని ఆయన హితవు పలికారు. బీజేపీ పార్టీకి పరకాలలో బలమైన క్యాడర్ ఉందని, ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని గాజుల నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలను పరకాల ప్రజలు గమనించి తగిన విధంగా స్పందిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు మల్లంపల్లి విద్యార్థి ఎంపిక

**పాలకుర్తి, ఫిబ్రవరి 02 (జనంసాక్షి):** ఈ నెల 7న హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టు మండలంలోని మల్లంపల్లి జెడ్పీఉన్నత పాఠశాల లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి జి. ప్రవీణ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధా నోపాధ్యా యుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లా తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోమ వారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్లో మల్లంపల్లికి చెందిన విద్యార్థి జి. ప్రవీణ్ పాల్గొని 80 మార్కులతో రెండో ర్యాంక్ సాదించి మంచి ప్రతిభను కనబరిచాడు. దీంతో ప్రవీణ్ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టు ఎంపికైన విద్యార్థి ప్రవీణ్ ను గ్రామ సర్పంచు పోశాల వెంకన్న, గైడ్ ఉపాధ్యాయుడు శ్రీకాంత్, ఆ పాఠశాల ఉపాధ్యాయులు. గ్రామస్తులు అభినందించారు.




## పాటి, బొగంపల్లి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 2, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం పాటి, భోగంపల్లి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిం చాలని ఆయా గ్రామాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు. కోణంపేట గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం పాటిలో 120 జనాభా, మన్నెగూడెం గ్రామపంచాయతీ అనుబం ధ గ్రామం బొగంపల్లిలో 140 జనాభా ఉందని అన్నారు. ఈ రెండు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గిరి ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారాయని, గిరిజన గ్రామాల ప్రజల దుస్థితిని కలెక్టర్ కు వివరించారు. దాంతో పాటు బొగంపల్లి , పాటి గ్రామాల్లో సీఎం గిరివికాస క్రింద ఏర్పాటు చేసిన బోర్లకు విద్యుత్ సౌక ర్యం, గిరిజనులకు పోడు పట్టాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడిపె శంకర్, మన్నెగూడెం సర్పంచ్ బానోత్ మధుకర్, మాజీ సర్పంచ్ గొర్లపల్లి బాపు, మాజీ ఉప సర్పంచ్ మధునయ్య, వార్డ్ సభ్యుడు మారయ్య యువ కులు సురేష్, భీమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఎస్పీ సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన రెండు చెక్‌పోస్టులు కుందూరుపల్లి, బాంబులగడ్డ చెక్ పోస్ట్ లను, పోలింగ్ స్టేషన్లను, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద అమలులో ఉన్న కట్టుదిట్టమైన బందోబస్తు, వాహనాల తనిఖీలు, భద్రతా చర్యలను పరిశీలించారు. అలాగే పోలింగ్ బూత్‌ల వద్ద చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించి, శాంతిభద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎటువం టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

### నలుగురికి తీవ్ర గాయాలు



**ఆత్మకూర్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవ తలను దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ క్రాస్ రోడ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి నలుగురు తీవ్ర గాయాల య్యాయి. సోమవారం ఆత్మకూర్ సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్గొండ జిల్లా నార్కట్పల్లి మండలానికి చెందిన బోడ శేఖర్, బుర్ర శివ, దైత అనిల్, యామనగంటి వెంకన్న, జిల్లా ప్రవీణ్ తో పాటు మరి కొంత మంది కలిసి ఆదివారం మేడారం జాతరకు వెళ్లారు. వానదేవతలను దర్శించుకొని సోమవారం ఇంటికి వస్తుండగా ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ క్రాస్ రోడ్ వద్ద ఆగి ఉన్న టిప్పర్ను బలంగా ఢీ కొట్టిన ట్రాలీ డ్రైవర్ పక్క కూర్చున్న బోడ శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి 108 లో వరంగల్ ఎంజీఎం కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి తెలిపారు.

## మేడారం అభివృద్ధిలో సీతక్క కృషి ఎనలేవి...!

- మేడారంను ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత సీతక్కదే...
- జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మెంబర్ మురుకుట్ల నరేందర్



**మంగపేట ఫిబ్రవరి 02(జనంసాక్షి):** ఆసియా ఖండం లోని అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమే ళగా సుప్రసిద్ధి చెందిన శ్రీ సమ్మక్క, సారలమ్మల వన దేవతల మేడారం జాతర. శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లుల ఆలయ పునర్నిర్మాణంలో ములుగు శాసనసభ సభ్యురాలు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కృషి ఎనలేనివి అని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్ అన్నారు. వందల ఏండ్ల చరిత్ర కలిగిన మేడారంను పూర్తిస్థాయిలో అభివృద్ధి పదంలో నిలిపేందుకు మంత్రి సీతక్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సుమారు 251 కోట్ల రూపాయల నిధులతో మరో కొన్ని వందల ఏళ్లు చరిత్రలో నిలిచే విధంగా శాశ్వత అభివృద్ధి పనులను అతి తక్కువ సమయంలోనే దగ్గర ఉండి పర్యవేక్షిస్తూ మేడారం జాతరను విజయ వంతం చేశారు అని మంత్రి సీతక్క కృషిని కొనియాడారు. మేడారం జాతరకు వచ్చేటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా ఎప్పటిక ప్పుడు పూర్తిస్థాయిలో జిల్లా అధికారులకు ఆదేశాలను జారీ చేస్తూ జాతర విజయానికి అహర్నిశలు కృషి చేశారు. శ్రీ సమ్మక్క సారలమ్మ ల మహా జాతర విజయోత్సవంలో ఎనలేని కృషిచేసిన అధికార యంత్రంగానికి హృదయ పూర్వక ధన్యవాదాలు నరేందర్ తెలిపాడు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



**కాటారం ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటా రం మండలంలోని ధన్వాడ గ్రామంలో స్థానిక మినిస్టర్ ఐటీ శాఖ శాసనసభ వ్యవహారాలు మంత్రి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మున్సిపల్ అభ్యర్థులను గెలిపించండి అని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చిన వాగ్దానాలు ఒక వరుస గ్రామంలో అమలు చేస్తున్నామని , పట్టణాల్లో కూడా రేషన్ కార్డులు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 10 లక్షల బీమా సౌకర్యం కల్పించామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ వ్యవహారాలను స్వయంగా చూస్తూ పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని , 10 సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేయలేక పోయిందని వారు అన్నారు.భవిష్యత్తులో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి కార్యక్రమాల్లో ముం దు ఉంటారని, అభివృద్ధి కొరకు చొరవ చూపుతారని అన్నారు . ప్రభు త్వం సంక్షేమ కార్యక్రమాలు పట్టణ వాసులకు కూడా అందివ్వడం గొప్ప తెలిపారు . ఈ కార్యక్రమంలో స్థానిక ధన్వాడ సర్పంచ్ చిటూరు మహేష్, మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్ , మాజీ సర్పం చ్ కారంగుల తిరుపతి , వెంకటరెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంజీఎంలో పనిచేయని ఎక్స్రే మిషన్లు

### ఇబ్బంది పడ్డ రోగులు



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి):** పేదల ఆసు పత్రి అయిన మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎం) లో సోమవారం ఎక్స్రే మిషన్లు పని చేయకపో వడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. రోజుకు 300 మంది పేషెంట్లు ఎంజీ ఎంకు వస్తున్న క్రమంలో ఎన్జీఎ ంలోని ఆరు ఎక్స్రే మిషన్లలో రెండు మాత్ర మే పని చేయడంతో ఎక్స్రే కోసం వచ్చినటువంటి పేషెంట్లు తీవ్ర అసౌ కర్యా నికి గురయ్యారు. గంటల తరబడి ఎక్సరే తీసే మిషన్ల కేంద్రం వద్ద బారుల తీరి కనిపించారు .సంబంధిత అధికా రులు ఈ విషయంలో చొరవ తీసు కొని ఎక్స్రే మిషన్లు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పని చేసే విధం గా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఎంజీఎంకు వచ్చిన రోగులు కోరుతున్నారు.

# చూపరులను ఆకట్టుకునేలా చీఫ్ మినిస్టర్ కప్ ప్రారంభం



ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (జనం సాక్షి): గ్రామస్థాయిలో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసి మైదానపు కలికితురాయిల్లా తీర్చిదిద్ది వారిని ప్రపంచ స్థాయిలో మెరిసే విధంగా మలిచే అద్వితీయ విశిష్టత గల బృహత్తర కార్యక్రమం సీఎం కప్ క్రీడలు. పపంచ స్థాయిని చేరేందుకు ఆదే మొదటి మండల స్థాయి పోటీలు " ఫ్రమ్ రూరల్ టు గ్లోబల్ క్రాఫ్టింగ్ ఛాంపియన్స్ 2025 - 26" అనే నినాదంతో గ్రామం నుండి ప్రపంచ స్థాయి విజేతల కొరకు సీఎం కప్ రెండవ ఎడిషన్ క్రీడా పోటీలు జడ్పీహెచ్ఎస్ ఆత్మకూరు క్రీడాస్థలం నందు ఫిబ్రవరి రెండవ తేదీ నుండి ప్రారంభమై మూడవ తేదీ మంగళవారం వరకు వరుసగా రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ క్రీడా వేడుకల అధ్యక్షులుగా ఆత్మకూరు ఎంపీడీవో శ్రీ శ్రీనివాస్ రెడ్డి , ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి- రాజు, విశిష్ట అతిథిగా అతిథులు, ఎస్సై తిరుపతి, కన్వీనర్ ఆత్మకూరు మండల విద్యాధికారి ఎన్. విజయకుమార్, జడ్పీహెచ్ఎస్ ఆత్మకూరు ప్రధానోపాధ్యాయురాలు పి. నిర్మల కుమారి, ఎస్ జి ఎఫ్ ఐ సెక్రెటరీ ఎస్.రజిత, సభ్యులు శంకర్, సురేష్ ,శ్రీలక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన వాలీబాల్ క్రీడలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఆత్మకూరు ద్వితీయ స్థానంలో అక్కంపేట , బాలికల విభాగంలో తిరుమలగిరి ప్రథమ స్థానంలో ద్వితీయ స్థానంలో పెద్దాపూర్ , ఖో ఖో ఆటలో బాలుర విభాగంలో అక్కంపేట ప్రథమ స్థానంలో , ద్వితీయ స్థానంలో ఆత్మకూరు బాలికల విభాగంలో పెద్దాపూర్ ప్రథమ స్థానంలో , ఆత్మకూరు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ క్రీడల్లో ఆత్మకూరు మండలంలోని 16 గ్రామాలు పాల్గొన్నాయి. నిర్వాహకులు విజేతలందరికీ హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

# జాతర ముగిసింది... దుర్గంధం మిగిలింది

కట్టెల కట్టదాలను, జాతర చుట్టూ స్థలం కొనుగోలు చేసి భక్తులకు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఉండేందుకు స్థలము లేక లక్షలాదిమంది భక్తులు వచ్చి ఇవన్నీ దేవతలను మొక్కుకొని తినకుండానే వెళ్లిపోయారని ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

## కాళేశ్వరం,అన్నారం మీదుగా చెన్నూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలి



కాళేశ్వరం , ఫిబ్రవరి 03 (జనం సాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి పలుగుల, మద్దులపల్లి, చంద్రుపల్లి, అన్నారం మీదుగా చెన్నూరు కు ప్రతిరోజూ మూడు ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు. ఈ మేరకు వారు మంచిర్యాల జిల్లా ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలతను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం అత్యంత అవసరమైందని, విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత సానుకూలంగా స్పందిస్తూ, విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలుగుల సర్పంచి విజయలక్ష్మి, మద్దులపల్లి సర్పంచి సరిత, చంద్రుపల్లి సర్పంచి గురుసింగ బాపు, అన్నారం సర్పంచి ప్రభాకర్ పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే దేశాభివృద్ధికి పునాది

**ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్**



ముధోల్, ఫిబ్రవరి 02 (జనం సాక్షి) : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కుంసర గ్రామానికి సంబంధించి 10 లక్షల నిధులతో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఎస్ఎస్ ఫ్యాక్టరీలోదజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతే దేశాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. స్వయం ఉపాధి చేసుకునే మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ, స్వంతంగా నిలబడే అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలన్నారు. వారితో పాటు సర్పంచ్ గంగాధర్ పటేల్ , భైంసా మండల మాజీ జడ్పీటీసీ సోలంకే భీమ్ రావు, గ్రామ సమైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- సప్పిడి సంజన రెడ్డి ఉప సర్పంచ్ ల ఫోరం ములుగు జిల్లా అధ్యక్షురాలు



గోవిందరావుపేట (జనంసాక్షి) : ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ములుగు జిల్లా ఉపసర్పచ్చుల ఫోరం అధ్యక్షురాలు సప్పిడి సంజన రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పసర గ్రామంలో సంజన రెడ్డి మీడియాతో మాట్లాడారు. ములుగు జిల్లా ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలుగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఫోరం ఐక్యతకు కృషిచేసి మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారం దిశగా సంఘటితంగా ముందుకు సాగుదామని అన్నారు.

**సంజన రెడ్డిని అభినందించిన మంత్రి సీతక్క**

ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన పసర గ్రామ ఉపసర్పంచ్ సప్పిడి సంజనా రెడ్డిని మంత్రి సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సంజన రెడ్డిని సన్మానించి మాట్లాడారు. చిన్న వయసులో రాజకీయాల్లోకి రావడం పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం ఉపసర్పంచిగా ఎన్నిక కావడం జిల్లా స్థాయిలో ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం ఒక లీడర్ కు లభించిన గొప్పతనమని సీతక్క అన్నారు. ముందు ముందు ఇంకా ఎన్నో విజయాలను సాధిస్తూ అభివృద్ధి పథంలో సాగాలని కోరుకుంటున్నానని అన్నారు.

## మానవత్వం చాటుకున్న గిరిజన ఉపాధ్యాయ దంపతులకు సన్మానం

**పంచాయతీ పాలకవర్గం**



మహదేవపూర్ ఫిబ్రవరి 2 (జనంసాక్షి) : పోగొట్టున్న బంగారాన్ని బాధితులకు అప్పగించి మానవత్వం చాటుకున్న మహదేవపూర్ జెడ్పిహైస్కూల్ బాలికల పాఠశాల పిడి ఉపాధ్యాయురాలు పూర్ణిమ నాగేశ్వరరావు దంపతులకు మహదేవపూర్ పంచాయతీ పాలకవర్గం సన్మానించారు. మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకోవడానికి వెళ్లిన ఆదివాసీ దంపతులకు మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడు( 6 లక్షల విలువగల) మేడారం జాతరలో దొరికినదున పోగొట్టుకున్న బాధితురాలికి నిజాయితీగా అప్పగించి వారి గొప్పమనసును చాటుకున్న పాఠశాల పిడి పూర్ణిమ నాగేశ్వరరావు దంపతులకు సోమవారం పాఠశాల ఆవరణలో మహదేవపూర్ వార్డు సభ్యులు గడ్డం స్వామి.పడల రాజమౌళి.ఎండి నయీం చీర్ల వంచ శేఖర్. రాములు.మహ్మద్ బిన్ అలీ. శాలు వద్దు సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి.ఉపాధ్యాయులు మధ్యమధు పాల్గొన్నారు.

# పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి

- టిపిబిఓలు చైన్ మెన్ లకు బిల్డ్ నౌ లో శిక్షణ ఇవ్వాలి
- ప్రతి రోజు రూ.50 లక్షల పన్ను వసూళ్లు చేపట్టాలి




వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 2(జనంసాక్షి): నగర పరిధి లోని పన్ను బకాయిల వసూళ్ల పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమ అనంతరం వివిధ విభాగాల అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశం లో పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు బిల్డ్ నౌ లో చైన్ మెన్ లతో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన బిల్డింగ్ ఇన్స్పెక్టర్ లకు శిక్షణ ఇవ్వాలని, ఇంజనీరింగ్ అధికారులు గ్రీవెన్స్ లో వచ్చిన నల్లా లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను వారం లోగా క్లియర్ చేయాలని, నల్లా పన్నుల పెండింగ్ బిల్లులు వసూలు చేసే క్రమం లో భాగం గా ఫోన్ ద్వారా సమాచారం అందజేసి చెల్లించేలా ప్రోత్సహించాలని, రెవిన్యూ సిబ్బంది ప్రతి రోజు కనీసం రూ.50 లక్షలు వసూళ్లు చేపట్టాలని,శని, ఆది వారాలలో కూడా క్షేత్ర స్థాయిలో పన్నులను సేకరించాలన్నారు. రాబోవు రెండు మాసాలు సెలవులు లేకుండా వసూళ్లపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. నగర పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన పన్ను బకాయిలను వసూలు చేసేలా డిప్యూటీ కమిషనర్ లు ప్రత్యేక దృష్టి సారించాలని ఇందు కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి పన్ను వసూళ్లు చేయాలని, నగరం లో ఉన్న సెల్ టవర్ ల బకాయిలు రూ. 6 కోట్ల 50 లక్షల వరకు పెండింగ్ లో ఉన్నాయని అట్టి వసూళ్లను సంబంధిత ఏజెన్సీ లనుండి వసూలు చేయాలని, రాబోవు 2 నెలల పన్ను వసూళ్లను చేపట్టడానికి వీలుగా ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి వసూళ్లు చేపట్టేలా చూడాలని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరు ఆశాజనకం గా లేదని అట్టి వసూళ్ల పై దృష్టి సారించాలని, 25% పెనాల్టీ మాఫీ ప్రక్రియను వేగవంతం గా చేపట్టి వాటి బకాయిలు చెల్లించేలా చూడాలని అన్నారు. ఆర్ ఐ లు రూ.50 వేలకు పైబడి బకాయిలు ఉన్న వారి జాబితాను తయారు చేసుకొని వాటి పై ప్రత్యేక దృష్టి సారించి వసూలు చేపట్టాలని ఈ సందర్భం గా కమిషనర్ ఆర్ ఐ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సి హెచ్ ఓ రమేష్,ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య,టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.